# నిర్ణయం

నిశ్శబ్దం-

చీకటికీ నిశ్శబ్దానికీ గల అవినాభావ సంబంధం ఆ అర్ధరాత్రి, యుద్ధరంగంలో ప్రస్ఫుటంగా తెలుస్తోంది.

ట్రెంచెస్‌లో నిలబడిన జవాన్లు, గురిచేసిన ఆయుధాలతో, తీక్షణమైన చూపులతో చీకటిని చీలుస్తున్నారు.

ఎక్కడా శత్రువుల్లో కదలిక లేదు. రోజంతా ఎడతెరిపి లేకుండా కురిసిన గుళ్ళవాన సాయంత్రానికల్లా ఆగిపోయింది. నిజానికి ఆ రాత్రి భయంకర పోరాటం జరుగుతుందని అందరూ అప్రమత్తంగా ఉన్నారు. గాయపడినవాళ్ళనీ చనిపోయినవాళ్ళనీ 'మెడికల్ కోర్స్' వాళ్ళు తీసుకెళ్ళిపోయారు.

శత్రువుల సంఖ్య తాజాగా ఎంత ఉందో- ఉదయంనుంచి జరిగిన పోరాటంలో ఎందరు చనిపోయారో ఇంకా తెలియాల్సి ఉంది. ఆ రాత్రికి డిఫెన్సివ్‌గా (స్వీయరక్షణతో) ఉండాలని జవాన్లకి కెప్టెన్ కుమార్ ఆదేశించాడు. అంటే అవకాశం ఉన్నా ఎడ్వాన్స్ కావడం రిస్క్ కావచ్చనిపించిందతనికి. బహుశా ఉదయానికల్లా పరిస్థితి మరింత బాగా అర్థం కావచ్చు. అఫెన్స్ సంగతి అప్పుడే చూసుకోవచ్చు.

బంకరులో లాంతరు కాంతి మందంగా వ్యాపించి ఉంది.

కెప్టెన్ కుమార్ బల్లమీదున్న మ్యాప్ పరిశీలిస్తూ, పెన్సిల్‌తో గుర్తులు పెట్టుకుంటున్నాడు.

అంతలో వైర్‌లెస్ మోగింది.

రిసీవర్ అందుకున్నాడు.

బ్రిగేడియర్ షరన్‌జిత్‌సింగ్‌కి ఆప్యాయంగా అందర్నీ బేటా అనే పిలవటం అలవాటు.

"ఎలా ఉన్నావ్ బేటా?"

"బావున్నాను సాబ్"

"సరంజామా సరిపడా ఉందా?"

"రేపటిదాకా కాలక్షేపం చేయవచ్చు. రేపు కొందరు జవాన్లనీ, అమ్యునిషన్‌నీ పంపే ఏర్పాటు చేస్తే మంచిది..."

"ఉన్నవాళ్ళంతా ఉషారుగా ఉన్నారుగా? ఆహారపదార్థాలకు లోటు లేదుకదా?"

నవ్వాడు కుమార్.

"యుద్ధంలో ఆహారంకోసం ఎవరు తపిస్తారు సాబ్? జవాన్లు కోరేది విజయం, మిగతావి వాళ్ళని బాధించవ్"

"గుడ్...కీపిటప్ ...గుడ్‌నైట్..."

"గుడ్ నైట్" రిసీవర్ పెడుతుండగా హవల్దార్ శ్యామ్ చెమటలు కక్కుతూ లోపలికొచ్చాడు. చంకకు సబ్ మిషన్‌గన్ తగిలించి ఉంది.

"బోలో శ్యామ్" అన్నాడు మందహాసంతో కుమార్.

"సాబ్" అంటూ నోరు పెగలనట్లు ఇబ్బందిపడ్డాడో క్షణం.

"చెప్పు పర్వాలేదు..." ప్రోత్సహించాడు.

"లెఫ్టినెంట్ సాబ్"

"ఊc...ఏమైంది లెఫ్టినెంట్‌కి"

"ఫారిన్ విస్కీ తాగుతున్నాడు సార్"

ఉలిక్కిపడ్డాడు కెప్టెన్ కుమార్.

"నువ్వు సరిగ్గా చూశావా" "సందేహంగా అడిగాడు.

"తమరు కూడా వచ్చి చూడండి సాబ్..."

"ఎక్కడున్నాడు లెఫ్టినెంట్ సాబ్'

"మూడో బంకర్‌లో"

"సరే- నువ్వెళ్ళు"

శాల్యూట్ చేసి వెళ్ళిపోయాడు.

కుమార్ రివాల్వర్ నొకమాటు తడిమి చూసుకున్నాడు. బయటికి తీసి ఛాంబర్‌ని పక్కకి జరిపి చూశాడు. ఆరు తూటాలున్నాయి. 'పౌచ్'లోకి నెట్టి బంకరు బయటకొచ్చాడు.

రెండో బంకరులో మందుగుండు సామగ్రి ఉంది.

మూడో దాంట్లో లెఫ్టినెంట్ భగత్ ఉన్నాడు.

నిశ్శబ్దంగా మెట్లు దిగి లోపలికి వెళ్ళాడు.

భగత్ అప్పటికే నిషా తలకెక్కి ఉన్నాడు. సీసా సగం ఖాళీగా ఉంది. దానిమీద అక్షరాలు చదివాడు- 'జానీవాకర్'.

"ఆయియే కెప్టెన్ సాబ్, మీరూ కాస్త ఆనందం పంచుకోండి..." ఇంకో గ్లాసులోకి వంపుతూ ఆహ్వానించాడు.

కుమార్ సీరియస్‌గా వెళ్ళి ఎదురుగా నిలబడ్డాడు.

అతనికి అందించాలనే ఉద్దేశంతో గ్లాసు ఎత్తి పుచ్చుకొన్నాడు భగత్.

కుమార్ చూపులు బల్లమీదున్న రివాల్వర్ మీద పడ్డాయి.

చటుక్కున దాన్ని చేతిలోకి తీసుకొని లాగుజేబులో వేసుకున్నాడు.

భగత్ కంగారుగా చూస్తూ "అరె నా రివాల్వర్ ఎందుకు లాకున్నారు?" అన్నాడు.

"చెబుతాను, ముందు సాయంత్రం నాలుగూ-ఆరు గంటలమధ్య ఎక్కడికెళ్ళి ఏం చేశావో చెప్పు..."

నవ్వడానికి విఫలయత్నం చేస్తూ "మీకు సాయంత్రమే చెప్పాగా?!" అన్నాడు.

"ఆ చెప్పడం కాదు, ఈ జానీవాకర్ కథ కావాలి నాకు" గంభీరంగా అన్నాడు.

"ఓ... ఇదా మా అంకుల్ స్టేట్స్‌లో ఉన్నారు. ఎప్పుడో ఆయన ఇచ్చింది నా దగ్గరుంటే ట్రెమ్‌పాస్ చేస్తున్నాను. టేకిట్ ఈజీ కెప్టెన్ సాబ్, మీరు భయపడాల్సిందేమీ లేదు. నేను సాయంత్రం అంతా సర్వే చేసి వచ్చాను. శత్రువుల్లో చాలామంది చనిపోయిగానీ, గాయపడిగానీ ఉండాలి. బహుశా విత్‌డ్రా అయ్యారని నా అనుమానం. మీరు వద్దన్నారుగానీ మనం హాయిగా అడ్వాన్స్ అయ్యే పని."

"నువ్వు సర్వే చేసి వచ్చావా, శత్రువులతో చేతులు కలిపి ఈ జానీవాకర్ బహుమతిగా సంపాదించుకొచ్చావా?" తీవ్రంగా చూస్తూ గద్దించాడు

"ఏమంటున్నారు మీరు?" ఏమీ అర్థం కానట్లు చూస్తూ ప్రశ్నించాడు.

అంతలో బయట పెద్ద వెలుగు... పేలుళ్ళు... మెషీన్‌గన్‌ల శబ్దాలు చెలరేగాయి.

జవాన్ల కేకలు వినిపిస్తున్నాయ్... హవల్దార్ శ్యామ్ గుమ్మందగ్గర నిలబడి "శత్రువులు బాగా దగ్గరికి వచ్చేశారు సార్, మన రెండో బంకరుమీదికి గ్రెనేడ్లు విసురుతున్నారు" అని అరుస్తూనే తూటా దెబ్బకి కూలిపోయాడు.

కెప్టెన్ కుమార్ వెంటనే రివాల్వర్‌తో గుమ్మంవైపు చూస్తూ నిలబడ్డాడు. ఎవరో అనుమానంగా దిగటం గమనించి, ఆ ఆకారం కనిపించగానే చటుక్కున ట్రిగ్గర్ నొక్కాడు. ఒకటి... రెండు... కూలిపొయ్యాడు.

మరో రెండు నిమిషాల్లో ఇంకొక శత్రుసైనికుడు...

రివాల్వరులో గుళ్ళు ఖాళీ అవుతున్నాయి.

గుమ్మం దగ్గర స్టెన్ కాల్పులు.

రివాల్వర్ జవాబులు.

రీలోడ్ చేసే వ్యవధి లేదు.

రెండో రివాల్వర్ బయటికి లాగాడు.

కాల్పులు...

ప్రతి కాల్పులు...

అయిదు గుళ్ళు ఖాళీ...

మిగిలింది ఒకే ఒక్కటి.

అది వేస్ట్ చెయ్యకూడదు. ఆ తూటా గురి తప్పకూడదు. రివాల్వర్‌లో గుళ్ళు మళ్ళీ

నింపేలోగా ఎవరైనా లోపలికి దూసుకువచ్చి తనను అంతం చెయ్యవచ్చుననే హెచ్చరికతో అలాగే గురిచేసుకుని గుమ్మంవైపు చూస్తుండిపోయాడు.

"ఇప్పటికైనా నా రివాల్వర్ నాకిస్తే, కనీసం ఆత్మరక్షణ చేసుకుంటాను...." భగత్ ప్రాధేయపడుతూ అడిగాడు.

అంతలో గుమ్మం దగ్గర ఓ గొంతు వినిపించింది...

"లెఫ్టినెంట్ భగత్, మేం నీ మిత్రులం. నేను కెప్టెన్ హుస్సేన్‌ని. ఎవరిదగ్గరన్నా ఆయుధాలుంటే, కింద పడేయించు. మర్యాదగా మాకు లొంగిపొమ్మని చెప్పు. క్విక్ ఎదురు తిరిగితే షూట్ చేస్తాం..."

భగత్‌కేసి అసహ్యం నిండిన కళ్ళతో చూశాడు కుమార్.

అతని మొహంలోకి తేరి చూడలేక గుటకలు మింగుతూ మొహం చాటుదేసుకున్నాడు భగత్.

"లెఫ్టినెంట్ భగత్, ఆన్సరేమీ లేకపోతే గ్రెనేడ్ విసురుతాం.'

కెప్టెన్ కుమార్ విచికిత్సకు గురయ్యాడు.

రివాల్వర్ కేసి ఓమాటు చూసుకున్నాడు. అందులో ఒకటే తూటా ఉంది. తన గురి ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పదు.

ఆ తూటాతో...శత్రువుల చేతికి చిక్కి హింసలు పడకుండా ఆత్మహత్య చేసుకోవచ్చు. ప్రాణాలకు తెగించి శత్రువుల్లో ఒకణ్ని మట్టుపెట్టవచ్చు. భగత్‌లాంటి దేశద్రోహిని తుదముట్టించవచ్చు.

"ఏంచెయ్యాలి?"

"లాస్ట్ వార్నింగ్...లోపల ఉన్నవాళ్ళు ఆయుధాలు పడేసి, లొంగకపోతే గ్రెనేడ్స్ విసురుతాం. ఓన్లీ త్రీ కౌంట్స్ ఒన్... టూ..."

కెప్టెన్ కుమార్ చెయ్యి రివాల్వరుమీద గట్టిగా బిగుసుకుంది. ఆ బిగింపులో ఆతని నిర్ణయం ఉంది.

"త్రీ..."

గ్రెనేడ్, రివాల్వర్ ఒకేసారి పేలాయి.

ఇద్దరూ నేలకొరిగారు.

కానీ,

వాళ్ళలో ఒక్కరిదే వీరమరణం...

ఆ రహస్యం భగత్ గుండెల్లో దూరి గర్వంగా నవ్వుకొంటున్న చివరి తూటాకే తెలుసు!

(యువ దీపావళి ప్రత్యేక సంచిక)